కథ

ఆర్.వి.చలపతి

# రెండు రకాల మనుషులు

"ఇదిగో! రాములు పాలు తెచ్చాడా?"

"ఏమండీ! ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టడానికి ఇవాళే ఆఖరు రోజు. రాములును పిలిపించి డబ్బులిచ్చి పంపండి"

"ఒక్క రోజంటే ఒక్కరోజు ఆ రాములు కనబడక మిమ్మల్ని మార్కెట్టుకు పంపితే మీరు చేసిన నిర్వాకం చూడండి. పుచ్చొంకాయలూ, ముదురు బెండకాయలూ, కుళ్లు టొమేటీలూ! అతను తెచ్చే మార్కెట్లోనే కదా మీరూ తెచ్చింది!"

"రాములూ! బాబ్బాబూ! గ్యాస్ రీఫిల్ బుక్ చేసి ఇరవై రోజులైంది. కాస్త ఆ గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి కనుక్కో. ఫోన్లలో వాడు మెదిలేట్టు లేదు"

"ఏమండీ! అత్తగారికి మాత్రలు అయిపోయి రెండు రోజులవుతోంది. ప్రతీరోజూ నేను చెప్పడమే గానీ మీకా ధ్యాసే ఉండదు. రాత్రి పది గంటలకు వచ్చి మరచిపోయానంటూ కథలు చెబుతారు. ఆ 'ప్రిస్క్రిప్షన్' కాగితం కాస్త ఇచ్చి వెళ్లండి. రాములుచేతనైనా తెప్పించుకుంటాను"

"అమ్మా! ఈ రోజు కాలేజీలో స్పోర్ట్స్ ఉంది. నేను భోజనానికి వచ్చి వెళ్లే వ్యవధి ఉండదు. మధ్యాహ్నం రాములు చేత క్యారియర్ పంపించు"

ప్రతీరోజూ పొద్దుపొడిచినప్పటి నుండి రాత్రి ఎనిమిది గంటల దాకా ఆ కాలనీలో ప్రతివారి నోట్లోనూ నానుతుండే ఆ 'రాములు' అన్న పేరు గల వ్యక్తి పూర్తి పేరు శ్రీరాములు. నేను పనిచేసే బ్యాంక్‌లోని ఉద్యోగులూ, వేరే బ్యాంకుల్లోని కొందరు ఉద్యోగులూ కలిసి ప్లాట్లు ఏర్పరచుకొని, సొంతంగా ఇండ్లు కట్టుకున్న కాలనీ అది. అందరూ దాన్ని 'బ్యాంక్ కాలనీ' అనే అంటారు. వేరే పేరు లేదు. నగరానికి దూరంగా ప్రశాంతమైన వాతావరణం, శుభ్రమైన గాలీ, మంచి డ్రెయినేజీ సౌకర్యాలతో హాయిగా ఉంటుంది గానీ ఏది కావాలన్నా నగరానికి వెళ్లాల్సిందే. కాలనీలో అందరికీ టూ వీలర్స్, కొందరికి కార్లు కూడా ఉన్నాయి. అయినా చిన్నచిన్న పనుల కోసం బండి తీసుకుని అంతంత దూరం పోలేము కదా! పొద్దున్నే కాఫీకి పాలు కావాలన్నా పాల పాకెట్టు కోసం అంత దూరం వెళ్లాల్సిందే. అవసరానికి అదనంగా తీసుకొని ఫ్రిజ్‌లో దాచుకున్నా రెండు రోజులకు పైన నిల్వ ఉంచుకోలేము. గడ్డం గీసుకోవాలని కూచున్నప్పుడుగానీ బ్లేడు లేదన్న విషయం గుర్తుకు రాదు. వాషింగ్ మెషిన్‌లో బట్టలు వేసి నీళ్లు పోశాక గానీ డిటర్జెంట్ పౌడరు లేదని గుర్తు చేసుకోరు ఇంట్లో వాళ్లు.

మా కాలనీ గేటుకు అవతల రోడ్డుకు ఆవలివైపు చిన్న పాక వేసుకొని కాపురముంటున్నాడు శ్రీరాములు. పక్కనే దూరంగా గొడ్లపాక. మేము ఆ కాలనీకి వచ్చిన కొత్తలో ఒక ఆవు, రెండు గేదెలను పెట్టుకొని పాల వ్యాపారం చేసుకునేవాడు. మేము అక్కడ చేరిన కొన్ని రోజుల తరువాత ఆ రెండు గేదెలూ కొద్ది రోజుల వ్యవధిలో ఒక దాని వెనుక ఒకటి చనిపోయాయి. ఒకే ఒక ఆవును పెట్టుకొని ఏం జీవనం సాగించగలడు! అప్పుడు మొదలైంది రాములు మా కాలనీలోని వారికి చిన్న చిన్న పనులు చేసిపెట్టడం. ఏ పని కావాలన్నా అతడిని పిలిచి పురమాయించే వాళ్లం. ప్రతిఫలంగా ఎంతో కొంత ముట్టజెప్పే వాళ్లం. ఎంత ఇచ్చినా సంతోషంగానే తీసుకునే వాడు.

ఒకరోజు మా ఇంటికి వచ్చాడు. అప్పుడు నేను బ్యాంకుకు బయలుదేరుతూ ఉన్నాను.

"రాములు వచ్చాడండీ! మీతో ఏదో మాట్లాడాలట!" అంది వనజ.

నేను బయటకు వచ్చి రాములుతో చెప్పాను. "ఇప్పటికే ఆలస్యమయిందయ్యా! సాయంత్రం ఆరు గంటలకు పైన వచ్చి కనబడు."

రాములు మౌనంగా వెనక్కు తిరిగాడు.

"వనజా! క్యారియర్ రెడీ చేశావా?" అన్నాను వనజ వైపు తిరిగి.

"ఏదీ! పొద్దున్నే మీ స్నేహితుడి భార్య వచ్చింది కదా! ఆమెతో మాట్లాడి పంపించేసరికి ఏ పనీ తెమల లేదు. మధ్యాహ్నం రాములు చేత పంపిస్తానులెండి" అంది వనజ.

"అవును, రాములూ! మధ్యాహ్నం క్యారియర్ పట్టుకురా. అప్పుడే మాట్లాడుదువు నీ విషయం కూడా" అన్నాను తిరిగి వెళ్తున్న రాములుతో.

సరేనని తలాడించాడు రాములు.

ooo

రాములు కొత్తగా రెండో, మూడో గేదెలు కొనాలనుకున్నాడు. మా బ్యాంకులో ఏదైనా లోన్ ఇప్పిస్తానన్న ఆశతో నన్ను సంప్రదించాడు.

"వాయిదాలు సరిగ్గా చెల్లించగలవా?" అని అడిగాను.

"బాబూ! నేనూ, మా అమ్మాయీ ఇద్దరమే మా ఇంట్లో ఉంటున్నది. మా ఇద్దరి కడుపు నిండటానికి ఎంత కావాలి! అయితే అమ్మాయి పెళ్లికెదిగింది. దాన్ని ఓ అయ్య చేతిలో పెట్టాలి కదా! అందుకే ఈ పాట్లంతా. తల తాకట్టు పెట్టయినా వాయిదాలు చెల్లిస్తాను. నన్ను నమ్మండి" అన్నాడతను.

"పాతికా, ముప్పయ్‌వేలు తీసుకొని ఏం చేస్తావు? ఇంకా ఎక్కువే ఇప్పించగలను. చెప్పు" అన్నాను అతని మాటల మీద నమ్మకం ఏర్పడ్డాక.

"వద్దు, బాబూ! ఎక్కువయితే నేను తీర్చగలనా అన్న సందేహం వస్తుంది నాకే" అన్నాడు నిజాయితీగా.

అన్నట్టుగానే ప్రతి వాయిదా ఖచ్చితంగా చెల్లించేవాడు. మొదట్లో వ్యాపారం బాగానే జరిగినా తరువాత మళ్లీ నష్టాల్లోనే కూరుకుపోయాడు. అయినా మాట ప్రకారం వాయిదాలు తప్పక చెల్లిస్తూనే ఉన్నాడు. అతనికి మా కాలనీలో ప్రతి ఇంటివాళ్లూ నెలకింత అని జీతంలాగా ఇచ్చే ఏర్పాటు చేశాను. అందుకు బదులుగా ఎవరింట్లో ఏ పని చెప్పినా చేసేవాడు. కాలక్రమేణా రాములు లేనిది ఏ ఇంట్లోనూ గడవని పరిస్థితి ఏర్పడింది.

మళ్లీ ఆవు ఒకటి చనిపోయింది. మేమిచ్చే డబ్బులు అతనికి చాలినంతగా ఉండేది కాదు. కూతురి పెళ్లి కోసం తయారుగా చేసిపెట్టిన నగలూ, అవీ తాకట్టు పెట్టసాగాడు. ఆ పరిస్థితుల్లో అతని కూతురికి ఒక మంచి సంబంధం వచ్చింది.

"ఎంత లేదనుకున్నా కనీసం యాభై వేలైనా లేనిది పెళ్లి చేయలేను. ఏం చేయాలో పాలుపోవడం లేదమ్మా!" అని వనజతో అన్నాడట. అతనికి ఎలా సహాయం చేయాలో తోచలేదు మాకు.

"ఏదో ఒకటి చేయండి. పాపం, ఆ పిల్లకు పెళ్లి చేసి పంపేశాడంటే, ఏదో తన మానాన తాను బ్రతగ్గలడు" అంది వనజ.

అనుకోకుండా పాత మిత్రుడైన సుధాకర్ కలిశాడు. చాలామంది డాక్టర్లతో అతనికి సత్సంబంధాలున్నాయి. ఎవరైనా కిడ్నీ దానం ఇవ్వదలుచుకుంటే ఇతను బ్రోకర్‌లాగా ఆ ఏర్పాట్లు చేస్తాడు. దానికి తగినట్టు ఇతనికీ కమిషన్ ఉంటుంది.

"ఆరోగ్యవంతుడైన మనిషి ఒక కిడ్నీతోటే తన ఆయువున్నంత వరకూ జీవించగలడు. ఇందులో నేను మోసం చేసేదేమీ లేదు. ఆర్థికంగా సాయం కావాలనుకున్నవారినే నేను అడిగేది. ఇటు వాళ్లకూ సాయం చేసినట్టుంటుంది, అటు ఇంకొకరికి ప్రాణదానం చేసినట్టూ ఉంటుంది" అన్నాడు.

"ఇటు నువ్వూ కమిషన్ సంపాదించినట్టుంటుంది. అయినా ఇదంతా పెద్ద గొడవ కదా! పొద్దున్న వేసే వార్తాపత్రికల్లో ఎన్ని వార్తలు చదువుతుంటాం!" అన్నాను కోపంగా.



"నేను అన్నీ పకడ్బందీగానే ఏర్పాటు చేస్తాను. ఎవరన్నా ఇచ్చే వాళ్లుంటే చెప్పు. లక్ష రూపాయల దాకా ఇప్పించగలను" అన్నాడు గర్వంగా.

నాకు ఎందుకో రాములు గుర్తుకొచ్చాడు. లక్ష రూపాయలు చాలా తక్కువ అని నాకు తెలుసు. అయినా నాకు ఈ వ్యవహారాలు తెలియవు కదా! నేను సుధాకర్‌తో ఏమని వాదించగలను! రాములు ఒప్పుకుంటే అతని కూతురి పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోతుంది. మిగిలిన సైకంతో వేరే ఏదైనా వ్యాపారమూ చేసుకోవచ్చు. అయినా రాములు ఒప్పుకోవాలి కదా!

వనజను సంప్రదించాను. "నీ కిడ్నీని అమ్ముకుంటావా?" అని ఒక సాటి మనిషిని అడగడం చాలా హేయంగా అనిపించింది. ఇంకెలా? వనజ మీద భారం ఉంచాను.

డైరెక్టుగా అడక్కుండా ఏదో మాటవరుసకు సుధాకర్ గురించి చెబుతున్నట్టుగా చెప్పి రాములును కదిలించింది వనజ.

అయిష్టంగానే ఒప్పుకున్నాడు రాములు. డబ్బు కోసం ఒక అంగాన్ని అమ్ముకోవడం అతనికి చాలా బాధ కలిగిస్తున్నట్టు తెలుస్తూనే ఉంది.

ఆ తరువాత ఏర్పాట్లన్నీ చకచకగా జరిగిపోయాయి. రాములును తీసుకెళ్లి చట్టపరమైన అంశాలన్నీ పూర్తి చేశాడు సుధాకర్. తరువాత డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి కావల్సిన పరీక్షలన్నీ చేయించాడు.

"అతను కొన్ని రోజుల పాటు హాస్పిటల్లోనే ఉండాల్సి వస్తుంది. అంతవరకూ కూతుర్ని ఎవరైనా తెలిసిన వాళ్లింట్లో ఉంచమని చెప్పు. హాస్పిటల్ ఖర్చులతో అతనికి సంబంధం లేదు. హాస్పిటల్‌లో అడ్మిట్ కాగానే యాభై వేలు ఇచ్చేస్తారు. ఆపరేషన్ పూర్తయ్యాక మిగిలిన సొమ్ము ఇస్తారని చెప్పారు" అన్నాడు నాతో.

"ప్రతీది మన ద్వారా చెప్పిస్తున్నాడెందుకూ? అతనే రాములుతో నేరుగా మాట్లాడుకోవచ్చు కదా!" అంది వనజ సందేహంగా.


"మన ద్వారా పరిచయమయ్యాడు కనుక మనకు చెబుతున్నాడు. అంతేగానీ అనుమానించాల్సిన అవసరం ఏమీ లేదులే" అని సర్దిచెప్పాను వనజకు.

ఈ వ్యవహారం మొదలైనప్పటి నుండీ కూడా రాములు చాలా మదనపడుతున్నట్టు గమనించాను. తాను కిడ్నీని అమ్ముకుంటున్నట్టు తన కూతురికి చెప్పలేదతను. మమ్మల్ని కూడా చెప్పవద్దని కోరాడు. అంతకుముందు పెళ్లిచూపులకు వచ్చి వెళ్లిన వరునితో వివాహానికి తాంబూలాలు పుచ్చుకోవడానికి తేదీ కూడా నిర్ణయించుకున్నాడు వాళ్లతో మాట్లాడి.

ooo

"ఏమండీ! ఈ రోజు పేపర్ చూశారా? అతనెవరో డాక్టరట. పేదవాళ్లను యేమార్చి కిడ్నీలు తీసుకుని విదేశీయులకు అమ్మి కోట్లు సంపాదించుకున్నాడట. అతని కోసమూ, అతనికి తోడు దొంగగా ఉన్న ఇంకొకతని కోసమూ అంతర్జాతీయ పోలీసులు వెదుకుతున్నారట. అంటే కిడ్నీలు అంతంత ధరలకు అమ్ముకుంటారా? మరి రాములుకు ఇస్తామన్న లక్ష రూపాయలు చాలా తక్కువ కదా! రేపు మన మెడకేమీ చుట్టుకోదు కదా! ఆ సుధాకర్ నమ్మకస్తుడేనా?" అని అడిగింది వనజ.

"లక్ష రూపాయలు తక్కువే వనజా! అతనికి ఇంకో మూడు లక్షల దాకా కూడా ఇవ్వచ్చు నా అభిప్రాయం ప్రకారం. అయితే కిడ్నీల దానం గురించి విన్నాం గానీ అమ్ముకోవడం, కొనుక్కోవడం గురించి మనకేం తెలుసు? సుధాకర్ ఆ వ్యవహారాల్లోనే ఉన్నాడు కనుక అతను చెప్పింది మనం నమ్మాలి. నమ్మకం లేకుంటే వదులుకోవాలి. రాములుకు అవసరం కాబట్టి



అమ్ముకుంటున్నాడు. దాని వలన అతనికెంత ముడుతుంది అని ఆలోచించగలం కానీ న్యాయంగా ఎంత ముట్టాలి అని వాదించగలమా? అసలు ఇందులో మనకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధమూ లేదు. అనవసరంగా ఎందుకు భయపడతావు? లక్ష రూపాయలకు పైన ఎవడిస్తే వాడికే అమ్ముకో" అనేసి సుధాకర్ వెళ్లిపోయాడనుకో, రాములు ఏం చేస్తాడు. "కిడ్నీని దానం ఇస్తాను. ఎంత ఇస్తారు?" అని ఎవరిని పోయి అడగ్గలడు? ఇదంతా బ్రోకర్ల మూలంగానే జరుగుతుంది. అయితే ఆ బ్రోకర్లు ఎవరో మనకెలా తెలుస్తుంది? ఇక ఆ విషయం గురించి ఆలోచించకు" అన్నాను.

వనజ మౌనం వహించింది.

రెండు రోజులు గడిచాక ఒక ఉదయాన్నే సుధాకర్ బ్యాంకుకు వచ్చాడు.

"సరైన తిక్కమాలోకాన్ని పరిచయం చేశావు నువ్వు" అన్నాడు కోపంగా.

"ఏమయింది?" అని అడిగాను.

"ఏమయిందా? ఆ రాములుగాడు ప్లేటు ఫిరాయించేశాడు. కిడ్నీ ఇవ్వడం తనకు ఇష్టం లేదని చెప్పేశాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే నాకు అయిదారు వేలు అనవసరంగా ఖర్చు అయింది."

నేనేమీ మాట్లాడలేకపోయాను.

సాయంత్రం ఇంటికి రాగానే వనజతో చెప్పి మండిపడ్డాను.

"ఇష్టం ఉంటే ఒప్పుకోవాలి. లేదంటే లేదని చెప్పాలి. ఈ రాములుకు సాయం చేయబోయి అనవసరంగా నేను వెధవనయ్యాను. ఎక్కువ కావాలంటే అడగొచ్చు కదా! అది వదిలేసి ఇలా...."

"డబ్బులు ఎక్కువ కావాలని రాములు ఇలా చేయలేదండీ" అంది వనజ నా మాటలకు అడ్డొచ్చి.

"మరి?"

వనజ వివరంగా చెప్పింది.

డాక్టరు దగ్గరికి పరీక్షల కోసం వెళ్లినప్పుడు అక్కడ ఒక యువకుడిని చూశాడట రాములు. ఆ యువకుడు ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడట. వేరే ఏ ఆదాయమూ లేని అతనికి రెండు కిడ్నీలూ ఫెయిలయి, లక్షలు లక్షలు దారపోసి కిడ్నీ కొనుక్కోలేని అతను ఎవరైనా ధర్మాత్ములు దానం చేయకపోతారా అని ఎదురు చూస్తున్నాడట.

"అమ్మా! నేను కిడ్నీని దానం చేసి, ఆ లక్ష రూపాయలతో నా కూతురి పెళ్లి చేయగలను. ఒకవేళ నా కిడ్నీ అమ్ముకోలేదనుకోండి. ఈ చేతుల్లో ఇంకా బలముంది. కాయకష్టం చేసి ఎలాగో నా బిడ్డ పెళ్లి చేయలేకపోను. ఆ కుర్రాడి పరిస్థితి ఆలోచించండి. ఉచితంగా అతనికి ఎవరు కిడ్నీ దానం చేయగలరు? ఎవరన్నా చేయాలనుకున్నా వాళ్లను ఈ బ్రోకర్లనే రాబందులా ముసురుకొని లక్షలు ఆశ చూపి కొనుక్కోడానికి ఎలా కాచుక్కూచున్నాయో నాకు బాగా తెలిసి వచ్చింది. అందుకే నేను ఆ అబ్బాయికి నా కిడ్నీని దానం ఇవ్వాలని తీర్మానించుకున్నాను" అన్నాడట రాములు.

"ఏది ఏమైనా రాములు చేసిన పని బాగా లేదు. దీని వలన అతనికి ఎటువంటి లాభమూ లేదు." అన్నాను మొహం గంటుపెట్టుకొని.

"రాములు మాటలు విని ఆ అబ్బాయి తల్లి అతని కాళ్ల మీద పడిందట. రాములు కూతుర్ని తన కొడుక్కు కానీ ఖర్చులేకుండా చేసుకుంటానందట." అంది వనజ.

"ఓహో! అదీ విషయం. ఇలా చేసినా కిడ్నీని అమ్ముకుంటున్నట్టే లెక్క. మొదట అతను కిడ్నీ అమ్ముకోవాలనుకున్నది కూడా ఆ అమ్మాయి పెళ్లి కోసమే కదా!" అన్నాను.

"పొరబడ్డారు. తాను చేసే సాయానికి ప్రతిఫలంగా ఆ అబ్బాయిని అల్లుడుగా చేసుకోవడం ధర్మంగా ఉండదని వాళ్లతోనే చెప్పేశాడట. "నా కూతురికంటూ ఒక మొగుడు ఎక్కడో పుట్టే ఉంటాడు" అన్నాడు రాములు" అంది వనజ.


నేను మౌనంగా ఉన్నాను.

"మనుషులు రెండు రకాలు ఉంటారండీ! ఉన్నతులు, నీచులు. అందులో రాములు మొదటి రకం అని నాకర్థమైంది"

వనజ పూర్తి చేయకముందే నేను అడ్డుపడి, "నేను రెండో రకం అంటావు. అంతేనా?" అన్నాను ఏమీ తెలియనట్టు కోపంగా.

"కాదంటారా? మీ సుధాకర్ ఇక్కడికి వచ్చాకే మీ దగ్గరికి వచ్చాడులెండి. ఈ 'కేసు' కుదిర్చినందుకు మీకూ నలభై వేలు ఇస్తానన్నాడట కదా! అది పోయిందన్న దిగులు మీ మొహంలో స్పష్టంగా కనిపిస్తూంటేనూ.."

నేను సిగ్గుతో తలవంచుకున్నాను.



## తెలుగులో నటిస్తా

శ్రియ నటించిన తాజా హిందీ చిత్రం 'మిషన్ ఇస్తాంబుల్' పరాజయం చవిచూడడంతో 'ఎలా ఫీలవుతున్నారు?' అని ఓ ఆసామీ ప్రశ్నిస్తే- 'ఇందులో అంతగా ఫీలవాల్సిందేం లేదు. అఫ్‌కోర్స్- మనం నటించిన సినిమా ఫ్లాపయితే బాధగానే వుంటుంది. కానీ నేను ఈ సినిమాకి చాలా కష్టపడి చేసాననే తృప్తి వుంది నాకు' అంటూ తెలివిగా జవాబిచ్చింది. 'నేను సినిమా స్టార్‌గా మారింది తెలుగు సినిమాల ద్వారానే. తగిన ఆఫర్ రావాలేగానీ తెలుగులో ఎప్పుడూ నటిస్తాను' అంటోంది శ్రియ.